క్లుప్తంగా

'అది రామదాసు విగ్రహం కాదు..'

నేలకొండపల్లి: ఇటీవల నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద గుర్తించిన విగ్రహం భక్త రామదాసుది కాదని మండలంలోని కొత్త కొత్తూరు శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం అర్చకులు పంతంగి పవన్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఆ విగ్రహానికి రామదాసు మాదిరి లేదని... వీరన్నస్వామి రూపంలో ఉందని తెలిపారు. పురావాస్తు శాఖ అధికారులు విగ్రహం రూపురేఖలపై పరిశోధన చేయకుండానే ఫొటోను చూసి నిర్ధారించడం సరికాదన్నారు. అలాగే, భిన్నంగా ఉన్న విగ్రహాలు, విరిగిన విగ్రహాలను దేవాలయంలో ఉంచకూడదని, ఇకనైనా అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

తమ్మినేనికి పరామర్శ


తమ్మినేనితో సీపీఎం నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను ఖమ్మం జిల్లా నాయకులు సోమవారం పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకొన్నారు. పరామర్శించిన వారిలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పోన్నం వెంకటేశ్వరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, యం.సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, బొంతు రాంబాబు, కళ్యాణం వెంకటేశ్వరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీలో చోటు


సైదులు

తిరుమలాయపాలెం: తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీలో మండలానికి చెందిన మీగడ సైదులు స్థానం దక్కింది. వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన ఇఫ్టూ తెలంగాణ ప్రగతి శీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ప్రథమ మహాసభలో సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నుకోగా మండలానికి చెందిన సైదులుకు రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ వర్కర్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఉద్యమిస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

16 నుంచి సమ్మె

నేలకొండపల్లి: కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఫిబ్రవరి 16 నుంచి చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల ప్రతినిధి కె.వీ.రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రావెళ్ల భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 3న మండల కేంద్రంలో నిర్వహించే కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక వ్యతిరేక మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా మండల స్థాయి సెమినార్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏటుకూరి రామారావు, పగిడికత్తుల రామదాసు, దుగ్గి వెంకటేశ్వర్లు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, పసుమర్తి శ్రీనివాస్, ఉపేంద్ర, వెంకన్న, చిర్రా బిక్షం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కామేపల్లి: ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి బాదావత్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండల కమిటీ ఆధ్వర్యాన తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, వీరన్న, శాంతయ్య, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

ఖమ్మంఅర్బన్: తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ జలవనరులశాఖ ఈఈ మంగళంపుడి వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాదులు తమ తమ కార్యాలయాల్లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెద్దబోయిన నాగరాజు, జిల్లా ప్రధానకార్యదర్శి బెజ్జంకి ప్రభాకరాచారి, మహిళ అధ్యక్షురాలు వెంకటరమణ, జయలక్ష్మి, జిల్లా కోశాధికారి శ్రీరామ్ నవీన్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లబెల్లి శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్, సరస్వతి, భావని, రత్నకుమారి, వెంకటేశ్వర్లు, సుభాని, రవి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుంటూరుకారం
వినోద	ఫైటర్
సాయిరాం	నా సామిరంగ
ఆదిత్య	హనుమాన్ (హిందీ)
శ్రీనివాస	కెప్టెన్ మిల్లర్
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

పట్టించుకునేదెవరు..?

పీవీ నరసింహారావు పార్క్‌పై చిన్నచూపు

- పాడైపోయి మూలనపడిన ఆట వస్తువులు
- నిర్వహణలేమితో తుప్పు పడుతున్న వైనం


విరిగిపోయిన చిన్నారులు ఆడుకునే 'సీ-శా'

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరాన్ని అభివృద్ధికి కేరాఫ్‌గా మార్చే ప్రక్రియలో భాగంగా నగరంలో నూతన పార్కులు, వాక్‌వేలను నిర్మించారు. ప్రతీ పార్కులో చిన్న పిల్లలు ఆడేందుకు ఆట వస్తువులతో పాటు పెద్దల కోసం ఓపెన్ జిమ్‌లు, వాక్‌వేలు నిర్మించారు. ప్రజలు ఆహ్లాదంగా గడిపేలా నిర్మాణాలు చేపట్టారు. అయితే దశాబ్దకాలం క్రితం నిర్మించిన పీవీ నర్సింహారావు పార్క్‌పై అధికారులకు, పాలకులకు చిన్నచూపు ఉంది. 2009 ఏడాదిలో ఈ పార్క్‌ను ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. పార్క్‌లో నాడు చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేయడంతో పెద్దలు సేద దీరేలా పార్క్‌ను నిర్మించారు. రెండేళ్ల క్రితం ఈ పార్క్‌లో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. కానీ పార్క్‌లో చిన్న పిల్లలు ఆడుకునే ఆటవస్తువులు నిర్వహణ లోపంతో పనికిరాకుండా పోతున్నాయి.

తొలిపార్కు నిరుపయోగంగానే..

నగరంలో నిర్మించిన తొలి పార్కుల్లో పీవీ నరసింహారావు పార్క్ ఒకటిగా స్థానికులు చెబుతుంటారు. ఈ పార్కులో ఆడుకునేందుకు చిన్న పిల్లలు ఉత్సాహం చూపిస్తుంటారు. అయితే ఇటీవల కాలంలో అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ఆట వస్తువులన్నీ నిరుపయోగంగా, తుప్పు పట్టి చిన్నారులు ఆడుకునేందుకు ఇబ్బందికరంగా మారాయి. పార్కులో చిన్నారులు ఆడుకునే 'సీ-శా', కుర్చీ రౌండ్ ఉయాల, జారుడు బల్లలు వంటి ఆట వస్తువులు మరమత్తులకు గురై సంవత్సరం అయినా పట్టించుకునే వారు లేరు. సాయంత్రం వేళ పార్కులో ఆడుకునేందుకు వచ్చిన చిన్నారులు ఆట వస్తువులు మరమ్మతులకు గురై ఉండడాన్ని చూసి నిరుత్సాహంగా వెనుదిరుగుతున్నారు. జారుడు బల్లలు తుప్పు పట్టడంతో వాటిపై ఆడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే వీటిని మరమ్మతులు చేయించి చిన్నారులకు అందుబాటులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

> **మరమ్మతులు చేయిస్తాం..**
>
> నగరంలోని పార్కుల్లో, వాక్‌వే లపై ఓపెన్ జిమ్‌లతో పాటు చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులను ఏర్పాటు చేయించాం. మరమత్తులకు గురైన ఆట వస్తువులను మరమ్మతు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. డీఈఈకి చెప్పి పార్క్‌లో మరమత్తులకు గురైన వస్తువులను పరిశీలించాలని సూచిస్తాం.
>
> – కృష్ణాలాల్, ఈఈ, కేఎంసీ


పక్కన పడేసిన గుండ్రటి ఊయల



తుప్పు పట్టి ప్రమాదకరంగా మారిన జారుడుబల్ల

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి


ఫిర్యాదును పరిశీలిస్తున్న ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: నగర ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కేఎంసీ కార్యాలయంలోని కమిషనర్ సమావేశ మందిరంలో గ్రీవెన్స్ నిర్వహించారు. రెవెన్యూ, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ తదితర విభాగాలకు సంబంధించి 28 ఫిర్యాదులు గ్రీవెన్స్‌కు వచ్చాయి. వాటిని పరిశీలించిన కమిషనర్ పరిష్కారం కోసం ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. గత గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులు పరిష్కారం అయ్యాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుదారుడిని కార్యాలయం చుట్టు తిప్పొద్దన్నారు. మరోసారి ఫిర్యాదుదారుడు ఒకే సమస్యపై పదేపదే తిరిగితే విభాగాల అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

దుప్పట్లు పంపిణీ..

ఖమ్మంఅర్బన్: పేద విద్యార్థులకు ఉపయోగపడే విధంగా గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, గిఫ్ట్ పాకెట్స్ పంపిణీ చేయడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి అన్నారు. నగరంలోని 7వ డివిజన్ టేకులపల్లి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలోని సుమారు 750 మంది నిరుపేద విద్యార్థినులకు సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, పౌడర్, పేస్ట్, బిస్కెట్ పాకెట్లు, సబ్బులు, పెన్నులు తదితర సామగ్రి పంపిణీ చేశారు. డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో 'మహాలక్ష్మి'ని స్వాగతిస్తున్నాం..


ఖమ్మం డిపో మాజీ అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం..

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకాన్ని తాము సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి, ఉపాధ్యక్షుడు ఎర్రంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులకు రెండు వేతన సవరణలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెలో ఆర్టీసీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఖమ్మం డిపో కమిటీ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు సిరిపురపు సీతారామయ్య, గుండు మాధవరావులతోపాటు రిటైర్ అవుతున్న డ్రైవర్ సిహెచ్ కృష్ణమూర్తిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ కార్యదర్శి సుధాకర్, ప్రచార కార్యదర్శి తోకలబాబు, ఫర్వీనా, రామారావు, కృష్ణ, బి.లింగమూర్తి, రవి, కిరణ్, పర్వేజ్, బసవయ్య, నాగమల్లేశ్వరరావు, శ్రీను, అయోధ్య, ముత్తయ్య, వీరయ్య శంకర్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్

ఖమ్మం సహకారనగర్: సైబర్ మోసగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని తమకు అనుకూలంగా వినియోగిస్తూ అమాయకులను బురిడీకొట్టిస్తున్నారని, అలాంటి నేరాలను తప్పించుకునేందుకు అవగాహన పెంచుకోవాలని సైబర్ క్రైం ఏసీపీ కె.శంకర్ అన్నారు. సోమవారం నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, పులిపాటి నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైబర్ నేరాలను అడ్డుకునే క్రమంలో కేంద్రం 1930 టోల్ ఫ్రీ నెంబర్‌తో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందని, రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరోతో ఇది పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విజయ్‌కుమార్, కళాశాల ప్రభుత్వ బాలికల జూనియర్ ప్రిన్సిపాల్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల సర్వే..


భూమిని సర్వే చేస్తున్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని టేకులపల్లి శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానం హక్కు భుక్తములు కలిగిన పట్టా భూములను కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ ప్రాంతంలో సర్వేనంబర్ 504లో 3 ఎకరాల 10 గుంటల భూమిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ తహసీల్దారు స్వామి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రమేష్, సర్వేయర్ లక్ష్మణ్, దేవాదాయ, ధర్మాదాయ ఖమ్మం విభాగం పరిశీలకురాలు ఆర్ సమత, అర్బన్ మండల ఇన్‌చార్జ్ చుందూరు రామకోటేశ్వరరావు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల పాత్ర కీలకం

కామేపల్లి: గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమైనదని కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ తీర్థాల చిదంబరరావు అన్నారు. సర్పంచ్ పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో సోమవారం ముచ్చర్ల సర్పంచ్ జాటోత్ జాయ్‌లూసీని గ్రామ పంచాయతీ పాలకవర్గం, అధికారులు ఘనంగా సన్మానించారు. పశు వైద్యాధికారి డాక్టర్ గోపీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, వార్డెన్ వేణు, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం


సర్పంచ్ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

రఘునాథపాలెం: మండలంలోని కోటపాడు ఉత్తమ పంచాయతీగా ఎంపికై కలెక్టర్ చేతుల మీదుగా సర్పంచ్ అవార్డు అందుకున్న సందర్భంగా గ్రామానికి జిల్లా స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చినందుకుగాను సోమవారం సర్పంచ్ దంపతులు బాతుల రమణసుధాకర్‌లను ఘనంగా సన్మానించారు.

నోటరీల నియామకానికి కృషి చేయండి

ఖమ్మం లీగల్: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ నోటరీ నియామకాలకు ఇంటర్వ్యూలు జరిగేలా చూడాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను ఖమ్మంకు చెందిన న్యాయవాది తాళ్లూరి దిలీప్ కోరారు. ఈ మేరకు కరీంనగర్‌లో సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. పలు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు పూర్తి చేసినందున తెలంగాణలో కూడా జరిగేలా కేంద్ర న్యాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రఘువీర్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయండి

నేలకొండపల్లి: వచ్చే నెల4న నేలకొండపల్లిలో జరిగే సంఘం జిల్లా విస్తృత స్థాయి కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పినపాక సురేష్ కోరారు. మండలకేంద్రంలో సోమవారం సమావేశాల కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి, సంఘం చేపట్టాల్సిన భవిష్యత్ కార్యక్రమాలపై సమావేశంలో చర్చించామన్నారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు నవాబ్, గోవిందరావు, కోశాధికారి టి.గురవయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైంటిఫిక్ రంగోళి విజయవంతం

నేలకొండపల్లి: మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం జన్యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైంటిఫిక్ రంగోళి కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా సైన్స్, గణితం అంశాలను విద్యార్థులు ముగ్గులు, ఎగ్జిబిట్ల రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈ.ప్రమీలా, శివకుమార్, జానీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల చొరవతో బస్సు సర్వీసులు


నేలకొండపల్లి: బస్సు వద్ద గ్రామస్తులు

నేలకొండపల్లి: మండలంలోని అప్పలనరసింహాపురం గ్రామానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చొరవతో సోమవారం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. బస్సు సౌకర్యం కోసం ఇటీవల స్థానిక కాంగ్రెస్ నాయకులు మంత్రి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి తెలుపగా ఆయన మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడి గ్రామానికి బస్సు సర్వీసును పునరుద్ధరింపజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెనికె జానకి రామయ్య మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి, దయాకర్‌రెడ్డికి గ్రామస్తుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మన్నె నగేష్, శీలం పెద్ద వెంకటేశ్వర్లు, పుసులూరి విశ్వనాథం, పెంటమళ్ల ఆశోక్, వెంపటి స్వామి, అయినాల భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండల పరిధిలోని ఎస్‌పీబంజర గ్రామానికి 8 ఏళ్లుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ఈ విషయాన్ని ప్రజలు తుమ్మల యుగేందర్‌కు తెలుపగా ఆయన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి స్పందించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సోమవారం నుండి బస్సు సర్వీసులు పునరిద్ధరింపజేశారు. ఈ మేరకు ప్రజలు మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ భానుప్రకాష్



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ భానుప్రకాష్

ఖమ్మంఅర్బన్: ఖమ్మఅర్బన్ (ఖానాపురంహవేలి)సీఐగా భానుప్రకాష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన సీఐని బదిలీ అయిన శ్రీహరి స్వాగతం పలికారు. పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు అనంతరం సీఐ భానుప్రకాష్ మర్యాద పూర్వకంగా ఉన్నతాధికారులను కలిశారు.

రేపు సర్వసభ్య సమావేశం

ఖమ్మంరూరల్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్నందున వారికి అదే రోజు వీడ్కోలు తెలిపి సన్మాన కార్యక్రమం ఉంటుందని, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

కోటమైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు

కామేపల్లి: కొత్తలింగాల గ్రామంలోని శ్రీ కోటమైసమ్మతల్లి దేవాలయం హుండీని ఖమ్మం విభాగం దేవాదాయశాఖ పరిశీలకురాలు ఆర్.సమత ఆధ్వర్యాన సోమవారం లెక్కించగా రూ.27,562 వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహణాధికారి నల్లమోతు శేషయ్య, చైర్మన్ మల్లెంపాటి శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, పూజారి పుల్లయ్య శర్మ, తోటకూరి సత్యమయ్య, గుడవర్తి శంకరయ్య, ఉమ, సుజాత పాల్గొన్నారు.

బాలగణపతి ఆలయంలో పూజలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ ఇందిరానగర్ జంక్షన్‌లో బాలగణపతి ఆలయంలో సోమవారం సంకటహర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు గిరిధర్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు బాజిన్ని వీరయ్య, తిరుపతిరావు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన కల్పించాలి

ఖమ్మం సహకారనగర్: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుపై ప్రతీ గ్రాడ్యుయేట్‌కి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలంగాణ ప్రైవేటు జూనియర్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పర్సా రమేష్ అన్నారు. పాత ఓటర్లు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉందని, ఈ విషయంపై అవగాహన కల్పించాలన్నారు.

సమగ్ర వేతన చట్టం చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం పిలుపులో భాగంగా ఎంపీడీఓ రవీందర్‌రెడ్డికి వ్యవసాయ కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో ఆర్థికంగా నష్టపోతూ, కుటుంబాలు గడవడం కష్టంగా మారిందన్నారు. కార్మికులకు పక్కా ఇళ్లతో పాటు రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఎస్.మల్లిఖార్జున్, గుంటి వెంకన్న, లక్ష్మణ్, కత్రం ఉపేందర్, పగిడిపల్లి వెంకట్రావు, నరేష్‌రెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: నూతన విద్యా విధానంతో విద్యారంగంపై చేస్తున్న దాడులను నిరసిస్తూ అఖిల భారత విద్యాహక్కు వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న చేపటిన చలోఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్ పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం విద్యారంగంపై నయా మనువాద, ఉదారవాద దాడులు చేస్తుందన్నారు. పేదలకు విద్యను దూరం చేసే విధానాలను అవలంభిస్తుందన్నారు. నాయకులు చందు, ప్రసాద్, లాల్ పాషా, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల మెస్ చార్జీల బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు, ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పాలకులు, ప్రభుత్వ అధికారులు విఫలమవుతున్నారన్నారు. సమస్యలను పరిష్కరించి, సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పర్వీన్, రాజు, జిల్లా నాయకులు తరుణ్, శరణ్య, శరీఫా, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

అగ్గితెగులు సోకిన వరి..


కూసుమంచి: తెగులు సోకిన పంటను పరిశీలిస్తున్న ఏఓ

కూసుమంచి: మండలంలోని లింగారంతండా గ్రామంలో అగ్గితెగులు సోకిన వరి పొలాలను సోమవారం మండల వ్యవసాయాధికారి రామడుగు వాణి పరిశీలించారు. ఈ మేరకు రైతులకు తగు సూచనలు చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి పంటకు అగ్గి తెగులు సోకుతుందని, కార్బెండిజంను ఎకరాకు 100 గ్రాముల చొప్పున లేదా ట్రైసైక్లోజోల్ మందును ఎకరాకు 200 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు. పొలం గట్లమీద ఉన్న కలుపు మొక్కలను తొలగించటం వలన తెగులు త్వరగా సోకకుండా అరికట్టువచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వంశీకృష్ణ, రైతులు ఉన్నారు.

కత్తెర పురుగు ఉధృతిని అరికట్టాలి


కామేపల్లి: రైతులకు సూచనలిస్తున్న ఏఓ తారాదేవి

కామేపల్లి: మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతిని అరికట్టాలని మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. మండలంలోని కొమ్మినేపల్లి, ముచ్చర్ల రెవెన్యూ పరిధిలో మొక్కజొన్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ గురించి అవగాహన కల్పించి రైతులకు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మేకల రమేష్, నల్లమోతు రవి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.